క్లుప్తంగా

'ఉపాధి' పనుల పరిశీలన

అనంతగిరి: వికారాబాద్ మండలం మదన్‌పల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఎంపీడీఓ సత్తయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తరచూ నీరు తాగాలని సూచించారు. అనంతరం కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లు అందజేశారు. నిర్మాణంలో ఉన్న రోడ్డును, నర్సరీని, మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, అధికారులు, నాయకులు రాంచంద్రయ్య, రాఘవులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహాదేవునికి ప్రత్యేక పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న భజన మండలి సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయంలో గురువారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు లింగాష్టక పారాయణం, అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి దర్శించుకున్నారు.

అక్రమ అడ్మిషన్లను అడ్డుకోవాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్: వికారాబాద్, తాండూరు పట్టణాల్లోని శ్రీ చైతన్య స్కూళ్లలో అక్రమ అడ్మిషన్లను వెంటనే అడ్డుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పీ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫోర్జరీ సంతకాలతో ఫైర్ సేఫ్టీ అనుమతి ఉన్నట్లు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించిన వికారాబాద్, తాండూరు పట్టణాల్లోని శ్రీ చైతన్య పాఠశాల అనుమతులు రద్దు చేసినట్లు గతంలో విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా రానున్న విద్యా సంవత్సరానికి దొడ్డిదారిన అడ్మిషన్లు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని శ్రీ చైతన్య పాఠశాలలను మూసేయాలని ఆయన కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరం

ఎంపీపీ లలిత

మర్పల్లి: సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు వరమని ఎంపీపీ బీ లలిత అన్నారు. గురువారం మండలంలోని సిరిపురంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరం ఉన్న వారికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగయ్య, పట్లూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అమరేశ్వరీ, కంటి వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా శివకుమార్



శివకుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న కృష్ణ తదితరులు

ధారూరు: బీసీ సంక్షేమ సంఘం ధారూరు మండల అధ్యక్షుడిగా అల్లాపూర్‌కు చెందిన ఎం శివకుమార్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వికారాబాద్‌లోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలకు అన్యాయం జరుగుతోందని, బీసీ ఉద్యోగులకు భద్రత లేకుండా పోయిందన్నారు. బీసీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనంతయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వివక్ష చూపితే ఫిర్యాదు చేస్తా

దళిత మహిళా సర్పంచ్ సుశ్మిత

బొంరాస్‌పేట: తన పట్ల వివక్ష చూపితే సహించేది లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని మండలంలోని దుప్‌చర్లకు చెందిన దళిత మహిళా సర్పంచ్ సుశ్మిత గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సభలు, సమావేశాలు, ప్రారంభోత్సవాలకు సంబంధించి తనకు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. తాను సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి తనను పిలువలేదన్నారు. అంటరాని మహిళగా చూడడం బాధేస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తనకు సముచిత స్థానం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

నవాబుపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని దాతాపూర్‌లో గురువారం హెచ్‌ఎండీఏ కింద మంజూరైన సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకప్పుడు గ్రామీణ ప్రాంత ప్రజలు ఎన్నో సమస్యలతో సతమతమయ్యే వారని నేడు అభివృద్ధిని చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, పార్కులు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో మనం దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, పీఆర్ ఏఈ లక్ష్మయ్య, సర్పంచులు బల్వంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అజయ్‌కుమార్, ఎంపీపీటీసీలు పద్మ, దయాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, ప్రకాశం, ప్రభాకర్, బోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో భవిష్యత్

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. సీఎం కప్ మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన టీంలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఈ క్రీడలను నిర్వహించిందన్నారు. విజేత జట్టు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, ఎస్‌ఐ భరత్‌భూషణ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, సర్పంచులు రత్నం, పర్మయ్య, పీఈటీలు ఆనందం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

రూ. 50వేలు అందజేసిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: మహనీయుడు అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన్ను తన నివాసంలో చాకల్‌పల్లి వాసులు కలిశారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సాయం చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే తన వంతుగా రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, చౌడాపూర్ మండల నాయకులు నర్సింలు, యాదయ్య, కృష్ణయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులు దారుణం

- ఇందుకు కారణమైన బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



ఎంపీ తీరుకు నిరసన తెలుపుతున్న నాయకులు

పరిగి: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీని వెంటనే అరెస్ట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చిన రెజ్లర్లపై అధికార మదంలో ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణమన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపిని అరెస్ట్ చేయడంతోపాటు లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు యాదగిరి, రాంచంద్రయ్య, ఎల్లప్ప, ప్రశాంత్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాత బృందం

దౌల్తాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కొడంగల్ సీఐ శంకర్ సూచించారు. గురువారం మండలంలోని మాటూర్ గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శంకర్ మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినులు, యువతులు.. పోకిరీలు, ఆకతాయిల నుంచి ఇబ్బందులు ఎదురైతే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌కుమార్, ఏఎస్‌ఐ ముత్తురాజు, సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని ఎంపీపీ సత్యాహరిశ్చంద్ర అన్నారు. గురువారం స్థానిక ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఆర్థిక లావాదేవీలపై అవగాహన ఉండడం తోపాటు నగదు రహిత లావాదేవీలపై చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది దిల్లేశ్వర్, రాంబాబు, వినోద్, స్వప్న, కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతుల లేమిపై రైతుల ఆందోళన



కొనుగోలు కేంద్రం నిర్వాహకులను నిలదీస్తున్న రైతులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు లేకపోవడంపై గురువారం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ధాన్యం నింపేందుకు గోనె సంచులు లేవన్నారు. ఆరబోసిన ధాన్యంపై కప్పడానికి టార్పాలిన్లు లేవని, హమాలీలు కూడా ఉండడం లేదన్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ సురేష్ కొనుగోలు కేంద్రంలోని సమస్యలను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.



కల్లాలు.. కలేనా?

గ్రామాల్లో కల్లాల నిర్మాణాన్ని అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వం ఆ తర్వాత చేతులెత్తేసింది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రధాన రహదారులపై పంట నూర్పి చేస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని జాతీయ రహదారిపై అలాగే బీటీ రోడ్లపై రైతులు నూర్పిడి చేస్తున్నారు. - బొంరాస్‌పేట



అభివృద్ధి పనులకు అడిగినన్ని నిధులు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



బార్వాద్ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: అభివృద్ధి పనులకు అడిగినన్ని నిధులు ఇస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం ఆయన కోట్‌పల్లి మండలం బార్వాద్, మోత్కుపల్లి, నాగసన్‌పల్లి, బీరోల్, ఎన్కెపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ గ్రామాల్లో రూ. 2.98కోట్లు విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధే తన లక్ష్యమన్నారు. దశల వారీగా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తాను శక్తి వంచన లేకుండా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్‌పై రాష్ట్ర ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందని, మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అనంతరం కోట్‌పల్లి మండలానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, ఏఎంసీ, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు దశరథ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఉమాదేవి, ఆయా గ్రామాల సర్పంచులు వెంకటేష్ యాదవ్, పాండు రంగారెడ్డి, పద్మ, సూర్యకళ, భారతమ్మ, రాంచందర్, ఎంపీటీసీ బందెయ్య, తహసీల్దార్ అష్ఫక్ రసూల్, పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధారూరు: అన్నదాతలను ఆదుకునేందుకే ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. గురువారం మండలంలోని గురుదోట్ల, నాగారం, ధారూరు, గట్టెపల్లి, నాగసముందర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు ధాన్యం విక్రయించొద్దన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ నర్సింహులు, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్ సంతోష్‌కుమార్, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, రాజుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న చంద్రశేఖర్‌గౌడ్

తాండూరు రూరల్: మండలంలోని మల్కాపూర్‌కు చెందిన జంగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలకు బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్‌గౌడ్ తన వంతుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో హసేన్ పటేల్, దస్తప్ప, నజీర్, సంజు, ఆటో మల్లేష్, అంజిలప్ప, హసేనప్ప పాల్గొన్నారు.

భూ సర్వే చేసి న్యాయం చేయండి

అనంతగిరి: మా భూమిని పక్క పొలం వారు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని, వెంటనే సర్వే చేసి హద్దులు చూపాలని పార్వతమ్మ కుమారుడు శ్రీకాంత్ గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితుడు శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. వికారాబాద్ మండలం సర్పన్‌పల్లి సర్వే నంబర్ 21, 22లో లింగాల పార్వతమ్మకు 2.29 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి ఆనుకుని సర్వే నంబర్ 20లో రాంచంద్రయ్య అనే వ్యక్తికి ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉంది. ఆయన సర్వే చేసుకుని మా పట్టా భూమిలోకి రావడం జరిగిందన్నారు. తాము కూడా సర్వే చేయించుకోవడానికి సమయం అడిగామని, కానీ దౌర్జన్యంగా మా పట్టా భూమిలోకి చొరబడుతున్నారని ఆరోపించాడు. తాము ఇదేంటని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే బంధువులమని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే కోసం చలానా కట్టినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తమ భూమిని వెంటనే సర్వే చేసి న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

కుల్కచర్ల: మాస శివరాత్రిని పురస్కరించుకుని ఇప్పాయిపల్లిలో కొలువుదీరిన భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవ లింగాయత్ సమాజం భక్తులు అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేశారు. చల్లంగ చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత కోకట్ జట్టు



విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

తాండూరు రూరల్: మండలంలోని కోటబాసుపల్లిలో స్వర్గీయ జీ భీమయ్య, బసమ్మ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఈ పోటీల్లో కోకట్ గ్రామ జట్టు విజేతగా నిలిచింది. కోటబాసుపల్లి జట్టు రెండో స్థానం దక్కించుకుంది. విజేత జట్టుకు రూ. 25వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నాగార్జున మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన జట్టు విజయం కోసం మరింత శ్రమించాలన్నారు. అప్పుడే విజయం వరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు పెద్ద అనంతయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, నాయకులు వీరేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మొగులప్ప, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న నేతలు

కుల్కచర్ల: బహుజనుల అభ్యున్నతికి పండగల సాయన్న విశేషంగా కృషి చేశారని ఇప్పాయిపల్లి సర్పంచ్ అనురాధ, ఎంపీటీసీ పద్మ అన్నారు. గురువారం మండలంలోని ఇప్పాయిపల్లిలో గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చడానికి ఆయన చేసిన కృషి, పోరాటం ఎంతో గొప్పదన్నారు. నేటి సమాజం ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు రామయ్య, నాయకులు ఆనంద్, మొగులయ్య, ఎల్లప్ప, నర్సింలు, ఆంజనేయులు, వెంకటయ్య, నర్సింలు, లక్ష్మయ్య, హన్మయ్య పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయంపై హర్షం

అనంతగిరి: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయడం సంతోషంగా ఉందని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి విజయేందర్, వికారాబాద్ డివిజన్ అధ్యక్షుడు రమేష్, తాండూర్ డివిజన్ అధ్యక్షుడు అప్పలనాయుడు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం

ఎంపీపీ విజయలక్ష్మి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి తదితరులు

చేవెళ్ల: మండలంలోని గ్రామాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఆలూరులో గురువారం మండల పరిషత్ నిధులు రూ.10లక్షలతో ఎంపీటీసీలు నరేందర్‌చారి, యాదమ్మల ఆధ్వర్యంలో సీసీరోడ్డు, ఎంపీపీ సొంత నిధులు రూ.75వేలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులను అన్ని గ్రామాలకు సమానంగా కేటాయించి అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని వివరించారు. ఆదర్శ మండలముగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ అయిన ఆలూరులో ఉన్న సమస్యలను స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు నరేందర్‌చారి, యాదమ్మలతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేశ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు నర్సింలు, అశోక్, పరిగి నర్సింలు, హైమద్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.